## బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట, జూన్ 19: మండల పరిధిలోని కొత్తలింగాయపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబ సభ్యులను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. శనివారం బీఆర్ఎస్ కార్యకర్త ముద్ద సాయిలు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్ నవీన్, పాత లింగాయపల్లి సర్పంచ్ రాణికిష్టయ్య, ఎంపీటీసీ సరస్వతి వెంకటేశం, నాయకులు, వెంకట్‌రాములు, పూల్‌సింగ్, బాలరాజు, కిష్టాగౌడ్ ఉన్నారు.

## ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 19: రాష్ట్రంలోని మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టి ఉదయ్ మాట్లాడుతూ మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏడాది నిధులను కేటాయించాలని కోరారు. చేతి వృత్తులు, కుల వృత్తులకు అందించే రూ.లక్ష పథకాన్ని మున్నూరు కాపులకు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, శేఖర్, మహిపాల్, ప్రసాద్, విజయ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు యోగా డే వేడుకలు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 19: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు యోగా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు యోగా శిక్షకుడు రవి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు అందరూ ఆహ్వానితులే అని పేర్కొన్నారు.

## సదరం క్యాంపు తేదీలు కేటాయింపు

మెదక్ అర్బన్, జూన్ 19: జిల్లా కేంద్ర దవాఖాన నందు దివ్యాంగులను గుర్తించి అర్హత గల వారికి సదరం ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి జూన్‌లో తేదీలను మీ సేవ, ఈ సేవ కేంద్రాలకు కేటాయించామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల వారు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొని రసీదులో కేటాయించిన రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో మెదక్ జిల్లా దవాఖాన నందు హాజరుకావాలని సూచించారు. వచ్చేటప్పుడు మీసేవ రసీదు, ఫొటో ఆధార్ జిరాక్స్, సంబంధిత మెడికల్ రిపోర్ట్స్ తీసుకురావాలన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

మెదక్ అర్బన్, జూన్ 19: మెదక్ ఆర్టీసీ డిపో డీఎం రవిచందర్ ఆధ్వర్యంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని మెదక్ ఆర్టీసీ డిపో డీఎం సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రయాణికులు సలహాలు, సూచనలను 77807 75815 నంబర్‌కు ఫోన్ ద్వారా తెలిజేయాలని కోరారు.

## ముగిసిన పాలిటెక్నిక్ ధ్రువపత్రాల పరిశీలన

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 19: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు జిల్లా కేంద్రంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజులుగా కొనసాగిన ధ్రువపత్రాల పరిశీలన సోమవారంతో ముగిసింది. చివరి రోజు 189 మంది విద్యార్థులకు గాను 185 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలత తెలిపారు.



రేగోడ్: హరితోత్సవంలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు



మెదక్ మున్సిపాలిటీ: మొక్కలు నాటుతున్న జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్

# ఉత్సాహంగా హరిత దినోత్సవం

- మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు
- విజయవంతంగా దశాబ్ది వేడుకలు
- పలుపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన హరిత దినోత్సవం సంబురంగా సాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు స్వచ్ఛందంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. హరిత దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల్లో నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. *- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 19*



మెదక్ రూరల్: బాలనగర్‌లో సర్పంచ్ వికాస్



పెద్దశంకరంపేట: మొక్క నాటుతున్న ఎంపీపీ శ్రీనివాస్



అల్లాదుర్గం: మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు



మెదక్ మున్సిపాలిటీ: మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో విద్యార్థులు



మెదక్ అర్బన్: మొక్కలు నాటుతున్న ఎస్పీ రోహిణిప్రియదర్శిని



హవేలీఘనపూర్: తొగిటలో హరితోత్సవం



చిన్నశంకరంపేట: మొక్క నాటుతున్న ఎంపీడీవో ప్రవీణ్



మెదక్ మున్సిపాలిటీ: మార్కెట్ కమిటీ ఆవరణలో..

## భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

మెదక్ అర్బన్, జూన్ 19: భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని మెదక్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా లింగంపల్లి గ్రామానికి చెందిన కోళ్ల శ్రీనివాస్ తండ్రి సర్దార్ మెదక్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య కోళ్ల సుజాతతో తరుచూ గొడవ జరిగేది. ఆదివారం సైతం భార్య సుజాతతో ఫోన్‌లో గొడవ పడి క్షణికావేశంలో హోటల్‌లో పైన హుక్కుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి 18 నెలల పాప ఉంది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.



## వైభవంగా బోనాలు

పెద్దశంకరంపేట, జూన్ 19: మండల పరిధిలోని కమలాపూర్ గ్రామంలో సోమవారం గ్రామ దేవతలకు ఘనంగా బోనాలు సమర్పించారు. మహిళలు నెత్తిన బోనాలతో గ్రామ పురవీధుల గుండా శివసత్తుల నృత్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య వెళ్లి గ్రామ దేవతలకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచ్ కుంట్ల రాములు, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, ఎంపీటీసీలు స్వప్నా రాజేశ్, వీణసుభాష్‌గౌడ్, మాజీ సర్పంచ్ రాములు, ఎస్ఐ బాలరాజు పాల్గొన్నారు.

## అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 19: జిల్లాలో అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని, విద్యాశాఖాధికారులు గుర్తించి అనుమతులు లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా యూనిఫామ్స్, బుక్స్, నోట్‌బుక్స్ పాఠశాలల్లోనే అమ్ముతున్నారని, అలాంటి పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు.